# సెంటిమెంట్


టి. షణ్ముఖరావు




**విశాఖపట్నం** రామకృష్ణా బీచ్‌లో ఆదివారం రద్దీని తప్పించుకుంటూ ఆ ఇద్దరూ భీమునిపట్నం వైపు సాగిపోతున్నారు. ఆడా మగా, ఆడం ఈవ్! అంతేకాదు. ఆ క్షణంలో వారిని సీజర్ క్లియోపాత్రా, శకుంతలా దుష్యంతుడూ ఎవరైనా అనుకోవచ్చు.

ఆ మగాడి గురించి ప్రత్యేకంచెప్పుకో వలసిందేమీ లేదు.

ఆమె గురించి: జుత్తు ఇలాంటిదని, ముక్కు ఇలాంటి దని, కళ్ళు ఇలాంటివని...ఇంకా అనేకానేక ఉపమానాలతో స్త్రీ సౌందర్యానికి విసెరా చూపించడం వల్ల ప్రయోజనం లేదు. ఈ ప్రయత్నం ఏనుగూ, పలుగురు గుడ్డివాళ్ళ కథ లాగా ఉంటుంది. మహాసముద్రానికి ఒడ్డునే అలల అలజడి ఉంచి, అలల కావల జలం నిశ్చలంగా ఉన్నట్టు—ఒక స్థితి వరకు మాత్రమే అభిరుచుల్ని బట్టి సౌందర్యానికి నిర్వచనం మారుతూంటుంది. ఆ తరవాత బాహ్య ప్రేరణలకి అతీతమైన గొప్ప సౌందర్యం స్ఫురిస్తుంది. ఇక్కడ వివాదాలూ, విభేదాలూ ఉండవు. వేరుగా రెటీనాను తాకి వేరే ప్రపంచాన్ని కనిపించనివ్వని బలీయమైన కాంతిరేఖ లాంటిది. ఆకలీ, అశాంతీ, యుద్ధాలూ ఎంతగా మానవుణ్ణి వేధిస్తున్నా అవి యాంత్రికంగా ఊరట కలిగిస్తుంది.




సౌందర్యం లేందే సృష్టికి పరమార్థం లేదు. ఈనాటిది సౌందర్యం.

ఇద్దరూ నడుస్తున్నారు. మాట్లాడుకోవడం లేదు. ఒకర్నొకరు చూస్తున్నారు అంతే. బహుశా వారి హృదయాలు లిపి ఉన్నవి, లేనివీ అయిన ప్రపంచ భాషలన్నిటిలోనూ వ్యక్తం చెయ్యలేని భావాలు కలబోసుకుంటూ ఉండొచ్చు. ఒకరిఅంతరంగాన్ని మరొకరు వింతగా చదువుతూ కొత్త భాష్యాలకి రూపకల్పన చేస్తూ ఉండొచ్చు. నిశ్శబ్దానికున్న భావం శబ్దానికి లేదు. అది జాగ్రత్ స్వప్నాలకి అతీతమైన అవస్థ. అది గుర్తించి చటుక్కున పురుషుణ్ని వేలకు దింపుతుంది స్త్రీ.

పారిజాతకూడా అందుకు భిన్నం కాదు. "మోహన్! బాదం పప్పుని కొందామా?"

విద్యుత్తు ప్రవహిస్తుంటే—స్విచ్ కదిలితే చాలు...వెలగడమూ, ఆరడమూ అని విచక్షణ లేకుండానే లైటు వెలుగుతుంది. ప్రేమ అంతర్లీనమై ఉన్నప్పుడు ఆడదాని మాట ఆటోమాటిక్ స్విచ్. అప్పుడు బాదంపప్పు కావచ్చు. బానెడు విషం కావచ్చు. తనకి తెలియకుండానే మగవాడు కొనేస్తాడు.

మోహన్‌కూడా అందుకు భిన్నం కాదు. కొన్నాడు.

మళ్ళీ నడుస్తున్నారు కాని, మౌనంగానే!

అలా...అలా...చైతన్యప్రకృతి దాటి సంఘమూ,మర్యాదలూ,సభ్యతలూ, మొగమాటాలూ గల ప్రపంచం దాటి భీమునిపట్నం వైపున్న సరుగుడు తోటలు చేరి నేలా, నీరూ కలిసే చోట కూర్చున్నారు.

ఎత్తయిన ఇసుక దిన్నె మీద వెన్నెల విగ్రహం లాగ ఆమె, కొంచెం కిందుగా ఆమె పాదాల ధూళిని మెత్తని రుమాలుతో తుడిచి ఇంకా తన వేళ్ళతో ఆ పాదాల పైన రాతా రంగులూ అవసరం లేకుండానే ప్రణయ చిత్రాలు కాబోలు గీస్తున్నా డతడు. కావ్యాల్లో గంధర్వుడు కావచ్చు, అలెగ్జాండరు చక్రవర్తి కావచ్చు, నియంత నెపోలియన్ కావచ్చు, సామాన్యుడు నాయుడు బావ కావచ్చు..పురుషుడి స్థానం అక్కడే.

జీవితం అంతా ప్రేమే కాదు గానీ, కూడూ గుడ్డా గూడూ—వీటి తరవాత అంత ముఖ్యమైంది ప్రేమ, ఈ మధ్య తెలుగు సినిమాలు కెలిడియో స్కోపులో చూపించి మొహం మొత్తించేస్తున్నారు: తప్పు! ప్రతి ప్రాణి పెర్‌పెట్యుయేషన్ కోసం తనకు తెలీకుండానే పరితపిస్తుందని నిరీశ్వర వాదులూ,పరిణామ శాస్త్రజ్ఞులూ సైతం అంగీకరిస్తారు. మానవుడు మేధస్సు గల ప్రాణి కనక జీవన చర్యకి ప్రేమనీ,ప్రణయమనే రంగులూ, అల్లికలూ, అందాలూ, అనుభూతులూ ఆపాదించుకుని తృప్తి పడుతున్నాడు. ఇందులో తప్పేం లేదు.

ఇంతసేపైనా ఇద్దరూ మాట్లాడుకోవడం లేదు.

నిశ్శబ్దంగా బాదం పప్పు తిని, ఆ కాగితాలతో పడవలు చేస్తున్నారు. ముందుగా అనుకోకుండా ఒకరికి తెలియకుండా మరొకరు అదే చర్యలో నిమగ్నమైపోయారు. ఇదే అసంకల్పిత మైన అన్యోన్య స్పందన కావచ్చు.

గాలికి ఎగురుతున్న ఆమె శిరోజాలు అతని మొహం మీద పడుతున్నాయి. 'అభ్యంగనావిష్కృత త్వదీయ నీలశిరోజ తమస్సముద్రాలు పొంగి...' అ కవిత్వం అతనికి స్ఫురించి ఉండాలి. అందుకే కాబోలు సిగలోని సన్నజాజుల పరిమళపు తుపానులో కొట్టుకు పోతున్నాడు.

పడవలు చెయ్యడం పూర్తయ్యింది.

ఇప్పుడు గుర్తించి నవ్వుకున్నారు.

"మోహన్! వీటిని కెరటాల్లో వదుల్దామా?"

"పద."

"నా పడవ ఎర్రది. నీది నీలంది. ఇద్దర్లో ఎవరి పడవ తొందరగా ఒడ్డుకు చేరుకుంటే వాళ్ళు గొప్ప వాళ్ళవుతారు."

పారిజాత బోటనీలో రీసెర్చి చేస్తూంది. మెడిసినల్ ప్లాంట్స్ మీద గొప్ప పరిశోధన చేసి అన్ని వైద్య రీతులనూ సమన్వయం చెయ్యాలని ఆమె తపన. మోహన్ ఓషనోగ్రఫీలో రీసెర్చి చేస్తున్నాడు. ఏదో సాధించాలని ఎన్నో దేశాలు తిరగాలని ఆశలున్నాయి.

"పందెం?"

"పందెం!"

ఇది చిన్న పిల్లల పని. శిశుప్రాయం నుంచీ ఎదుగుతున్న మనిషికి ఇంత వయస్సులో కూడా ఈ బాల్యచేష్టలు పరిణామానికి అద్దం పడుతున్నాయి.

కొంచం నీటి లోపలికి వెళ్ళి పడవలు కెరటాల మీద వదిలారు. నీలం పడవ నీటి లోపలికి పోతూంది. మోహన్ గంభీరంగా నవ్వుతున్నాడు. ఎర్రపడవ ఒడ్డుకి త్వరగా వచ్చేస్తూంది. పారిజాత కేరింతలు కొడుతూంది, ప్రకృతి జల్లు మనేట్టుగా. గాలి తిరిగింది. నీలి పడవ ఒడ్డుకి వచ్చేస్తూంది. మోహన్ చిరునవ్వుతో నిల్చున్నాడు. కెరటం రావడంతో ఎర్రపడవ లోపలికి పోతూంది. పారిజాత చిటికెలో బుంగమూతి పెట్టింది.

జీవితంలో పురుషుడికున్న స్పోర్టివ్ నెస్ స్త్రీ కెక్కడిది?

పారిజాత నిరాశతో, ఓటమితో పిడికిలి బిగించింది.

నీలి పడవ ఒడ్డుకు అంటుకుంది.

ఈసరికే జరుగుతున్న రసాయనిక చర్యకి ఉత్ప్రేరకం చేర్చినట్టయింది.

పారిజాత కూలిపోయింది. "మోహన్! మోహన్! నా పడవ పోయింది...పోయింది పట్టుకోవూ... పట్టుకోవూ! నే నోడిపోయాను... ఓడిపోయాను. నా బతుకు నా రీసెర్చి ఇంతే. ఇంతే..." కాగితం పడవకీ, జీవితానికీ ముడివేసే పని స్త్రీదే.

స్త్రీ ఓడిపోయానని అంగీకరించడం పురుషుడు సహించడు. తాను గెలవ గలిగినా, ఓడిపోయి ఆమెని గెలిపించాలి. ఆమె సంతోషాన్ని చూసి తను ఆనందించాలి. పెళ్ళిలో ఉంగరాలాటతో ఇంతే జరుగుతుంది.

"వెళ్ళి పట్టుకో, మోహన్! వెళ్ళు... వెళ్ళవూ?"

"కానీ, పారిజాతా! చాలా దూరం పోయింది, పారిజాతా!"

"ఇంతేనా... ఓషనోగ్రఫీ చదివింది. ఆ మాత్రం ఒక కెరటం దాటి పడవ పట్టలేవూ... పెద్ద మగాడివి..." ఓషనోగ్రఫీని, సముద్రంలోకి పోతున్న కాగితం పడవని పట్టుకొనే సామర్థ్యాన్నీ పోల్చే పని కూడా స్త్రీదే.

ఈ మాట పురుషత్వానికి సవాలు. తరతరాల అహంకారానికిది ఎత్తిపొడుపు. ఆత్మబలానికిది అశనిపాతం. అతడిలో అన్ని నాడీ మండలాలూ విచలించేయి. అంతటితో ఆగకుండా మరో బటన్ కూడా నొక్కింది. "మోహన్! నే నోడిపోవడం, నా రీసెర్చి.. నా కలలు , నా జీవితం .. తగలడిపోవడం...నీ కిష్టమన్న మాట... ఇంతేగా నువ్వు నన్ను ప్రేమించింది. ఒట్టి కబుర్లేనా?"! ఆవేశం నోటికీ, మెదడుకీ ఉన్న సంబంధాన్ని తెంచేస్తుంది.

మోహన్ రాబట్‌లా కదిలాడు.

"ఆల్ రైట్—నీ పడవ తెస్తాను, పారిజాతా... తెస్తాను"

చటుక్కున దూకేసి "లేకుండా తిరిగి రాను..." ఈదుతూముందుకుపోయాడు. మోహన్‌కన్నా పడవ ముందుకుపోతూంది. దాని కోసం మోహన్ ఇంకా ముందుకు పోతున్నాడు. ఇంకా ఇంకా లోపలికి... అలా అలా ఉప్పొంగే అలల్లోకి...ఏదో అతీంద్రియ శక్తి ఆవహించి ముందుకు

పాఠకులకు

స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుచూ
మా అభిమాన సంస్థ 'వాహిని' సమర్పిస్తున్న

# నూతన ప్రచురణలు

అన్ని గ్రంథాలయములలో నుండవలసినవి
అందరూ చదువదగినవి

శ్రీముఖ (ఆంధ్ర శాతవాహనుల చరిత్ర)
— డా. ముదిగొండ శివప్రసాదు రూ. 22-00
[illegible] (ద్విరక్తు నవల)
— అరికెపూడి (కోడూరి) కౌసల్యాదేవి 14-00
విష్ణుప్రియ (పునర్ముద్రణ)
— జొన్నలగడ్డ లలితాదేవి 16-00
[illegible] (ఆంధ్రజ్యోతి సీరియల్)
— ఆర్. సంధ్యాదేవి 9-50
మధుర సంగీతం ,, 12-00
డాక్టర్ కృష్ణమోహన్ ,, 12-00
గులాబీ సుందరి ,, 12-00
ప్రణయ జ్యోతి ,, 10-00
స్వయంవరం — చిలుకూరి పురుషోత్తం 20-00
ఉద్యోగం కోసం ,, 16-00
ఆహారం ఎలా చెయ్యాలి? ,, 7-50

## మా నూతన బాల సాహిత్యం

విజ్ఞాన విశేషాలు 3 భాగాలు
—కొండముది హనుమంతరావు 1 Set 13—50
గౌతమీపుత్ర శాతకర్ణి —సింగంపల్లి అప్పారావు 6—00
జస్వంత సింహుడు ,, 6—00
మహారాణా హమీర్‌సింహుడు ,, 6—00
దళవాయి రామప్పయ్య ,, 6—00

వివరములకు :

వాహిని పబ్లిషింగు హౌస్,
గవర్నరుపేట, విజయవాడ-520 002.

VTS/V/82


నెడుతున్నట్టుగా... కేవలం ఆడది కోరిన కాగితం పడవ కోసం!

సృష్ట్యాది నుంచి ఎవరైనా పనికట్టుకొని జాబితా రాసి ఉంటే ఇలాంటి సన్నివేశాలు అన్ని దేశాల్లోనూ అన్ని నాగరికతల్లోనూ కోటానుకోట్లు లెక్కకు దొరికేవి.

పారిజాత తన ఉద్రేకంలోంచి తేరుకొని ప్రమాదాన్ని గుర్తించింది. "మోహన్! వచ్చెయ్యి, మోహన్! వద్దు మోహన్! వచ్చెయ్యి మోహన్!" కెరటాల హోరు ఈ పిలుపు మోహన్ చెవి సోకనివ్వలేదు.

అతడు అలల్లోకి ముందుకి పోతూ ఉన్నాడు.

ఆమె పెనుక్కి పిలుస్తూనే ఉంది.

మోహన్ మాయమైపోయాడు.

పారిజాత స్పృహ తప్పి పడిపోయింది, కెరటాలకి తడుస్తూనే.

కాల మాగలేదు. ఆమెకి తెలివి వచ్చేసరికి ఎర్ర పడవ మాత్రం ఆమె పాదాల దగ్గర ముద్దగా పడి ఉంది.

• • •

దుఃఖం — గుండె లోపలి పొరలు చుట్టుకోగా ఆకస్మికంగా వస్తుంది. కాలం దుఃఖాన్ని విషాదంగా మారుస్తుంది. విషాదంలో బాధ, మననమూ గతమూ, గంభీరతా పరివ్యాప్తమై ఉంటాయి. కొందరు విషాదానికి అలవాటు పడతారు. వారి కది అలంకారంగా మారుతుంది. మరి కొందరికి అందాన్ని రెట్టింపు చేస్తుంది. ఇంకొందరికి విషాదం లేందే జీవితం నడవదు. సంతోషం ఎదురవుతున్నా రాకీపడకుండా తప్పుకొని, గతాన్ని త్రవ్వుకొని మళ్ళీ విషాద ప్రపంచంలోకి జారిపోతారు.

పారిజాత రీసెర్చి చూసే ఇంట్లో కూడా అద్వైత లోకానికి గిరి గీసుకొని కూర్చుంటుంది. అప్పటి రెండు పడవలూ అద్దాల్లో కన్పించే విధంగా ఒక దంతపు పెట్టెలో పదిలంగా ఉంచి తన టేబిల్‌మీద పెట్టుకొంది. పండగల్ని నిషేధించుకొంది. పార్టీలకు, పెళ్ళిళ్ళకు వెళ్ళదు. ఎప్పుడో ఒక సినిమాకు—అది కూడా విషాదాత్మకమైనదే అని నిర్ధారించుకున్న తరవాతనే వెళ్తుంది. ప్రతి ఆదివారం భీమునిపట్నం వైపు—లనే పరుగుడు చెట్ల దగ్గర అదేచోట కూర్చొని సముద్రం లోకి చూస్తూ గడుపుతుంది.

ఈమధ్యనే రవికీ, ఆమెకీ పరిచయమైంది. అతడు గణిత శాస్త్రంలో రీసెర్చి చేస్తున్నాడు. లెక్కలకన్నా, తర్కంపైన అతడికి ఆసక్తి ఎక్కువ. వస్తు వాదం గురించి బాగా తెలుసుకున్నాడు. అతని కొక ప్రియురాలుండేది. కాని, ఆమె ఒక ప్రమాదంలో చనిపోయింది. దుఃఖించాడు. కాని, రీసెర్చి మానెయ్యలేదు. బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెంచుకోలేదు.

సంతోషంగా ఉన్నప్పుడు వ్యక్తుల అభిరుచులూ, నడవడులూ భిన్నంగా ఉంటాయి. మనస్సుకి ఎంత దగ్గర వాళ్ళయినా వారి సంతోషంలో పాలు పంచుకొంటున్నట్టు రూపిస్తాం గానీ, నిజంగా పంచుకోలేం. కాని, విషాదంలో ఉన్నప్పుడు భిన్నత్వం ఉండదు. ఎదుటి వారి స్థానంలో మనల్ని తాదాత్మ్యం చేసుకొని పాలు పంచుకోనూ వచ్చు. అక్కడ ఏకత ఉంటుంది. అందుకే కాబోల్ను పండగలూ, పెళ్ళిళ్ళల్లో వ్యక్తులు తప్పులు పట్టుకొని తన్నుకుంటారు. రోగాలూ, చావు కార్యాల్లో పొరపొచ్చాలు మరిచి కలిసి పనిచేస్తారు.

ఇక్కడ విషాదంవల్ల వచ్చిన అన్యోన్యమైన సోదర్యా, అనునయమూ, ఆర్ద్రతా రవినీ, పారిజాతనీ దగ్గరగా తెచ్చాయి.

ఒక సంవత్సరంలో రవి మరణించిన ప్రియురాల్ని పూర్తిగా మరిచిపోయాడు. మరుపు మానవుడికి వరం. స్త్రీకన్నా పురుషుడికో ఇదింకా అధికం. అందుకే కాబోలు భార్య చనిపోయిన ఒక నెలలోపుగా మళ్ళీ పెళ్ళి చేసుకొనే మగవాళ్ళు ఎక్కువగా కనిపిస్తారు.

పారిజాతలో గణనీయమైన మార్పు లేదు.

ఒక సాయంకాలం ఇద్దరూ విశాఖ ఔటర్ హార్బరులో సముద్రం లోపలికి ఉన్న గోడమీద కూర్చుని కబుర్లు చెప్పుకొంటున్నారు.

రవి ఏదో జోక్ వేశాడు. పారిజాత నవ్వింది. సముద్రం జల్లు మనేట్టుగా నవ్వింది. అంతలోనే ఆమె చేతి బాగ్ క్రింద నీట్లో పడిపోయింది.

ఆ బాగ్ మోహన్‌తో కలిసి వెళ్ళి కొన్నది. నగరంలోని దుకాణాలన్నీ గాలించి ఎన్నో ఎంపికలు చేసి కొని ఎంతో అపురూపంగా దాచుకొంటున్నది.


పారిజాత గిలగిల్లాడింది. ఏడ్చింది. ఒక బాగ్‌కోసం ఇంత పరితపించడం ఎందుకో రవికి ఊహ కందనిది.

"ప్లీజ్, రవీ...ఆ బాగ్ కావాలి... ఎలాగైనా కావాలి...తీసివ్వవూ..ఇవ్వవూ"

"అవకాశం లేదు, పారిజాతా! అ కిందికి ఎవరూ దిగలేరు."

"నో. అది కావాలి. ఎలాగైనా కావాలి."

రవిని కదిలించేస్తోంది. నవ్వాడు...పారి




జాత ఇంకా చలించిపోయింది.

"పారిజాతా! అందులో అతి ముఖ్యమైన డాక్యుమెంట్లు ఏమైనా ఉన్నాయా?"

"లేవు."

"మళ్ళీ గడించలేని డబ్బేమైనా ఉందా?"

"రెండు రూపాయలున్నాయి."

"అయితే ఆ బాగ్ కోసం ఎందుకింత ఆరాటం?"

పిడుగు పడ్డట్టు చూసింది.

"యూ...యూ..." ఇంకా ఏదో అనబోయి మళ్ళీ సర్దుకొని "ప్లీజ్: రవీ...ఆ బాగ్ కావాలి." ఏడుస్తోంది.

"చూడు, పారిజాతా! నీ కా బాగ్ కావాలంటే ఒక కూలీ కావాలి. ఇక్కడ దొరకడు కనక అవతలికి వెళ్ళివెతికి తీసుకు రావాలి. ఒక పొడవైన పోలిప్రొపిలీన్ తాడు సంపాదించాలి. దాని చివర ఒక హుక్ కట్టాలి. ఈ హుక్ ఆ బాగ్ తాళ్ళాకా బెల్టుకి తగిలేట్టుగా గురి చూసి విసరాలి.." ఇలా చెబుతున్నాడు.

పారిజాత నీరైపోయింది.

"అఫ్టరాల్ ఒక హేండ్ బాగ్ కోసం అంత శ్రమపడ్డం అవివేకం. పారిజాతా! పద. ఇక్కడ్నుంచే బజారు కెళ్ళి అంతకన్నా మంచిబాగ్ కొనుక్కుందాం..."

ఇక్కడే రవి దారి తప్పిపోయాడు.

స్త్రీ తనకోసం చావడానికి సిద్ధపడ్డ వాడికోసం నిజంగా చచ్చిపోతుంది. కొంచెం తార్కికంగా ఆమె కోసం చస్తే నా కేమొస్తుందని ప్రశ్నించుకొంటున్నట్టు పసిగట్టిందా—వాడు నిజంగా చచ్చిపోయినా కన్నీటి బొట్టు రాలనివ్వదు.

కాలం గడుస్తోంది. ఇద్దరూ సమాంతరంగానే ఉన్నారు.

ప్రేమ వ్యక్తి కోసం...పెళ్ళి సమాజం కోసం...కమ్యూనిస్టు దేశాల్లో వ్యక్తి శ్రేయసుకన్నా పార్టీ శ్రేయస్సు ముఖ్యమైనట్టుగా వివాహ వ్యవస్థ పటిష్ఠంగా ఉన్న సమాజంలో ప్రేమకన్నా పెళ్ళి అతి ముఖ్యం. అసలు పెళ్ళి ముందే కాదు. తరవాత కూడా ప్రేమ ఉండాల్సిన అవసరం ఎంతమాత్రం లేదు. ఎంత అపూర్వమైన ప్రేమికులైనా మీరు జీవితాంతం ఒకర్నొకరు తాకకుండా ప్రేమించుకోండి అని శాసిస్తే మరుక్షణంలో ప్రేమకు సలాం కొట్టేస్తారు లేదా ఆత్మహత్యన్నా చేసుకుంటారు. అందుకని ప్రేమకన్నా పెళ్ళి అవశ్యం.

దాన్ని రవి బాగా గుర్తించిన వాడు. అందుకే ఒక రోజు—

"పారిజాతా! మనం పెళ్ళి చేసుకొందామా?"

"పెళ్ళా?"

ఉత్త పెర్పెట్యుయేషన్‌కి పెళ్ళితో పనిలేదు. ఈ సంగతి అన్ని దేశాలవారూ, అన్ని మతాలవారూ అంగీకరిస్తారు. అయితే మనిషి జీవితాన్ని మతమనీ, దేశమనీ, రాష్ట్రమనీ, ఆర్థిక రాజకీయాలనీ, ఉద్యోగాలనీ, ఆస్తులనీ వ్యవస్థీకరించుకున్నాడు కనుక పెళ్ళి కూడా అందులో ఒక భాగం చేసుకున్నాడు. కాకపోతే మిగతా జంతువుల్లాగా ఈ హోమోసెపియన్స్ కూడా పిల్లల్ని కని వదిలేస్తే ఆ ఆర్థికభారం ఎవరిది? నాగరికత ఎక్కడిది? ఇంత సైన్సూ, సౌఖ్యమూ, ప్రగతి ఏది?

రవి ఆగి మళ్ళీఅన్నాడు—"అవును."

"అసలు నీ కెందు కా ఉద్దేశం కలిగింది?"

"మనిద్దరి మధ్యా ప్రేమ ఉంది కనుక."

ప్రేమకి నిర్వచనం ప్రతి వ్యక్తికీ మారిపోతోంది. త్యాగమే ప్రేమనీ... ఆరాధనే ప్రేమనీ ఇలా రకరకాల తత్త్వాలు. అయితే రవిదృష్టిలో ప్రేమ ఒకరి గురించి ఒకరు తెలుసుకోవడం మాత్రమే.

"ఉందా?"

ఇంతటితో సంభాషణ ఆపెయ్యొచ్చు కాని, తనవాదం పూర్తిగా వినిపించి సీట్లో కూర్చోవాలనే న్యాయవాదిలా ఉన్నాడు రవి.

"లేకపోయినా...నువ్వు అదా.... నేను తుగా..."

పెళ్ళి చేసుకొనే స్థితిలో ఇలా 'ఆర్గ్యు' చేసుకోవడం దివాలాతనం.

నవ్వింది. "పెళ్ళికి అదొక్కటే అర్హతా?"

ఆశ్చర్యపోయాడు. ఈ రకమైన ప్రశ్నలు వస్తువాదుల్ని కలవర పెడతాయి. "కాక?"

"నాకలా అనిపించడం లేదు."

రవి కాళ్ళ క్రింది ఇటుకల్ని ఒక్కొక్కటే తీసేస్తోంది పారిజాతం కాని, ఆకర్షణనే అయస్కాంత క్షేత్రంలోకి వచ్చిన స్త్రీ పురుషులు పెళ్ళికోసం ఒక నిర్ణయం తీసుకోక తప్పదు. ఈ లిట్మస్ పరీక్ష పూర్తి చేద్దామనే దీక్షతో ఉన్నాడు రవి. ఇంకెన్నాళ్ళిలా?

"పారిజాతా! ఒక రీజన్ ఆలోచిద్దాం. మనం ఒకర్నొకరు చూస్తే అసహ్యించుకొనేంత అనాకార్లం కాదు. అపరిచితులం కాదు. మన మధ్య అనుమానాలూ, అపార్థాలూ లేవు. సంఘంలో మసిలేందుకు సభ్యతా, సంస్కారమూ కొత్తగా నేర్చుకోవాల్సిన పనిలేదు. ఇలా పెళ్ళి చేసుకున్నా ఆర్థిక ప్రపత్తి కోసం వెతకనవసరం లేదు."

"అట్నుంచి నరుక్కొస్తున్నావు."

"అవును. మొక్కల వర్గీకరణంలో నువ్వంతే చేస్తావు. రసాయనిక విశ్లేషణ లోనూ అంతే చేస్తారు. నీ ఒకప్పటి ప్రియుడుగాని, నా ఒకప్పటి ప్రేయసి గాని ఇప్పుడు లేరు. కాగా మనిద్దరం చాలా దగ్గరయ్యాం. నేనైనా మరో స్త్రీని...నువ్వయినా మరో పురుషుణ్ణి పెళ్ళాడాలి. అదే మనిద్దరం ఎందుకు కాకూడదు? ఆలోచించు."

రవి వాదనలో నిజం ఉంది. కాని, పారిజాతకి కావలసింది లేదు.

"అంతేనా?"

"నా సంగతి చెప్పమంటావా?"

"చెప్పు."

"నాకు నువ్వు కావాలి."

"నేను కావాలా? నేనే కావాలా?"

నవ్వాడు. "సరే నువ్వే కావాలి.

"చనిపోయినవాడు ఈ క్షణంలో బతికి వస్తేనో?"

రవి ఒక్క క్షణకాలం ఆగాడు.. అంటే పారిజాతకి ఆమడ దూరం వెళ్ళిపోయాడు.

"రాడుగా."

"వస్తేనో?"

సరిగా పురుషుడు చీటితో ఉద్వేగంగా తంత కొడతున్న సమయంలో— గాలిలో ఎగురుతున్నప్పుడు ఏ కళ ఉంటుందో చెప్పు అని నిలదీస్తుంది స్త్రీ. రవి నేలమీది మనిషి.

"నిన్ను!"

మళ్ళీ వెంటనే అతడి సమాధానం వినకుండానే అడిగింది—"ఈ క్షణంలో మోహన్ బతికొస్తే నే నెవర్ని ఎన్నుకుంటానని అడగవేం?"

అడిగినా, ఆమె చెప్పే జవాబు స్ఫురిస్తోంది ముందే.

"రాడుగా."

"రవి! నీకు భార్య కావాలి."

"మరి నీకు భర్త అక్కర్లేదా?"

"కావాలి..." ఆగింది. ఆమె చెప్పబోయేది అతడికి తెలిసిపోయింది. కాని, అతడి కాళ్ళ క్రింద భూమి కదిలి పోవడం లేదు. ఆకాశం విరిగి పడి పోవడం లేదు.

"కాని నాకు మోహనే కావాలి." వాక్యం ముగించి లేచి నిల్చుంది బరువుగా.